జాషువ

# క్రీస్తు చరిత్ర

వ్యాఖ్య

బూదాటి వెంకటేశ్వర్లు

ఎమెస్కో

# క్రీస్తు చరిత్ర

# క్రీస్తు చరిత్ర

## సృష్టి

ఆ.వె. ఆదియందు దైవ మాకసంబును భూమి
నహము రాత్రి నర్కుతుహినకరుని
ఆరునాళ్ల సలిపి, యవల నేడవనాడు
విశ్రమించె, మహిమ విస్తరింప

అర్థాలు : ఆదియందు = సృష్టి ఆరంభకాలమందు; అహము = పగలు, అర్కున్ = సూర్యుని, తుహినకరుని = చంద్రుని.

తాత్పర్యం : సృష్టి ఆరంభకాలంలో దైవం, ప్రపంచానికి తన శక్తి తెలిసేలా ఆకాశాన్ని, భూమిని, పగటిని, రాత్రిని, సూర్యుడిని, చంద్రుడిని ఆరు రోజులలో సృష్టించి, ఏడవరోజు విశ్రమించాడు.

ఆ.వె. మన్ను ముద్దజేసి మనుజుని సృష్టించి
వాని కంఠమందు ప్రాణమూది
వాని ప్రక్కటెమ్ముతో నారి గల్పించి
నిలిపె వానితోడు నీడగాగ

అర్థాలు : ప్రాణము+ఊది=ప్రాణం పోసి; ప్రక్క+ఎమ్ము=ప్రక్కటెముకతో;

తాత్పర్యం : మట్టిని ముద్దగా చేసి, మనిషిని సృష్టించి, అతని కంఠంలో ప్రాణంపోసి, ఆతని పక్కటెముకతో స్త్రీని రూపకల్పన చేసి, వానికి తోడునీడ అయ్యేటట్లుగా నిలిపాడు.

కం. ఆదిమ దంపతులగు న
య్యాదా మవ్వలను, రమ్యమగు భూముల యం
దేదోను తోటయం దిడి,
ఆదరమున సర్వ సుఖములం దమరించెన్

అర్థాలు : ఆదిమదంపతులు + అగు = సృష్టిలో మొదటి దంపతులైన

తాత్పర్యం :సృష్టిలో మొదటి దంపతులైన ఆదాము, అవ్వలను రమ్యమైన పొలాలలోనున్న 'ఏదోను' తోటలో ఉంచి, ఆదరంగా వారికి అవసరమైన అన్ని సుఖాలను అమరించి పెట్టారు.